ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించుకోవాలి

విశాలాంధ్ర-పామూరు : నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని సీఐ కాటూరి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రోడ్ల పై డ్యాన్సులు, పార్టీలు చేసుకోరాదనీ, డీజేలను ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యం కలిగించరాదని, అర్ధరాత్రి టపాసులు పేల్చుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగించరాదన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనాలను నడుపుతూ అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నరు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని సర్కిల్ పరిధిలోని ప్రజలకు శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

ఏపీ ఎన్జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆర్డీవో

విశాలాంధ్ర-కనిగిరి : ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను శనివారం కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జాన్ ఇర్విన్ మాట్లా డుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో కనిగిరి తాలూకా యూనిట్ అధ్యక్షులు పివి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్వీ నరసింహారావు, సహ అధ్యక్షులు షేక్ మహమ్మద్ రఫీద్, ట్రెజరర్ షేక్ హజ్రత్ అలీ, పాలకవర్గ సభ్యులు జి వెంకటస్వామి, షేక్ అహ్మద్ భాష, టి వెంకట్ రెడ్డి, ఎస్ సుబ్బారెడ్డి, పివిసి కిరణ్ కుమార్, బి బాలకృష్ణ, జి కిరణ్ కుమార్, బి వెంకటసుబ్బయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులు ప్రయాణీకుల పట్ల విధేయతతో ఉండాలి

సీపీఐ నాయకులు కె. వీరారెడ్డి

విశాలాంధ్ర-శింగరాయకొండ : ఆటో కార్మికులు ప్రయాణీకుల పట్ల విధేయతతో మసలుకోవాలని అందరూ ఐక్యంగా కలిసిమెలసి ఉండాలని కొండేపి నియోజకవర్గ సీపీఐ నాయకులు కె.వీరారెడ్డి పేర్కొన్నారు. శనివారం శింగరాయ కొండ బాలయోగినగర్‌లో నేతాజి ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. ఆటో డ్రైవర్లు అందరూ డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఆటో డ్రైవర్లు పాటించాలని కోరారు. కొండేపి నియోజకవర్గ ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు ఎస్కె. జాకీర్ హుస్సేన్, నేతాజి ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జిలాని, శ్రీధర్, ప్రసాద్ జెండాను ఆవిష్కరించిన వారిలో ఉన్నారు. ఏఐటీయూసీ నాయకులు బాలకోటయ్య, బాలాజీరెడ్డి, కొండలరావు, శింగరాయకొండ ఆటో డ్రైవర్‌లు ఊళ్లపాలెం ఆటోయూనియన్ అధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఐ కార్యాలయం ఎదుట అంగన్వాడీల బైఠాయింపు

విశాలాంధ్ర-కనిగిరి : అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నటువంటి నాయకులపై ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ దౌర్జన్యం నశించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పీసీ కేశవరావు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే, ఎస్సై మాధవరావు తీరును నిరసిస్తూ కనిగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించి సర్కిల్ కార్యాలయం ఎదుట బైఠాయించి తమ వ్యతిరేకతను అంగన్వాడీలు వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నోటి దురుసుదనం తగ్గించుకోవాలని, మహిళల పట్ల దుర్భాషలాడిన ఎస్సైని ఉన్నతాధికారులు విచారించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం ఆగదని తెలియజేశారు. పోరాట నాయకుల పై దౌర్జన్యంగా వ్యవహరించే తీరు పునరావృతం అయితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టడం జరుగుతుందని అన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్ సుజాత, సీత, రాజేశ్వరి, రజిని, భాగ్యలక్ష్మి, సౌందర్య, రామ సుబ్బులు, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, ఐద్వా నాయకులు ఎస్ కే బషీర, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలంలో గత సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుండి ఈ సంవత్సరం మార్చి 31 వ తేదీ వరకు నిర్వహించిన ఉపాధి పనులను తనిఖీ చేయుటకు తనిఖీ బృందాలు వచ్చినట్లు ఉపాధి హామీ పథకం ఏపీవో మహాలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డీఆర్పీ మాట్లాడుతూ గత. ఆర్థిక సంవత్సరంలో 785 పనులు చేపట్టి 7,66,75,221 రూపాయలు ఖర్చు చేశారని, ఈ పనులను తనిఖీ బృందం తనిఖీ చేస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం నుండి ఈ బృందాలు అన్ని గ్రామాలకు వెళ్లి తనిఖీలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసకుమార్, ఎం ఈ వో శ్రీనివాసులు, ఏపీవో మహాలక్ష్మి దేవి, సోషల్ ఆడిట్ ది ఆర్పీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గ్రామాలలో నీటి సమస్య లేకుండా చూడాలి



విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని పలు గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని దోర్నాల ఎంపీపీ గుమ్మా పద్మజ యల్లేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన దోర్నాల్లోని ఏంఆర్సీ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో నాసర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ గుమ్మ పద్మజా యల్లేష్ మాట్లాడుతూ మండలంలో ఇంటి వద్దకే రేషన్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని, తెలియజేశారు. అనంతరం సంక్షేమ పథకాలను చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆమె తెలియజేశారు. తహసిల్దార్ వేణు గోపాలరావు, ఇన్‌ఛార్జ్ ఆర్ఐ వి నాగేశ్వర రావు, వైస్ ఎంపీపీ, పరుచూరి సురేఖ, వైస్ ఎంపీపీ దర్శనం నాగయ్య, దోర్నాల సర్పంచ్ చిత్తూరి హారిక, ఎంపీటీసీలు కిక్కురి విజయలక్ష్మి, పొందుగుల నాగలక్ష్మి, వ్యవసాయ అధికారి జవహర్లాల్ నాయక్, పంచాయతీ కార్య దర్శులు మోహన్ రావు, సునీత, రంగయ్య, అంజనీ కుమార్ షేక్ మున్ని, ఆయా శాఖ అధికారులు, పాల్గొన్నారు.

3 నుంచి మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె జయప్రదం కోరుతూ కార్మికుల ర్యాలీ

బైక్ ర్యాలీ నిర్వహించిన మున్సిపల్ వర్కర్స్

విశాలాంధ్ర-మార్కాపురం : అనేక దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనవరి 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జరుగు సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ప్రదర్శన జరిగింది. స్థానిక పూలసుబ్బయ్య శాంతి భవనం నుంచి బయలు దేరిన ఈ ప్రదర్శన కోర్టు సెంటర్, కంభం బస్టాండ్, దోర్నాల బస్టాండ్‌ల మీదుగా మునిసిపల్ కార్యాలయానికి చేరుకుంది. అనం తరం జనవరి 3వ తేదీ నుంచి జరగబోవు సమ్మెకు సంబంధించి యూనియన్ నాయకులు మునిసిపల్ కమిషనర్ గిరికుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పారిశుద్ధ్య కార్మికుల సంఘం అధ్యక్షులు అందె నాసరయ్య మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ రంగంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని అలాగే మృతి చెందిన, రిటైర్డ్ అయిన వారి స్థానాల్లో వారివారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మృతి చెందిన వారికి ఎక్స్‌గ్రేషియోతో పాటు గ్రాడ్యుటీ ఇవ్వాలని, పీఎఫ్‌లో నెలకొన్న సమస్యలను మునిసిపల్ కార్యాలయంలోనే పరిష్కారమయ్యేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్నట్లుగానే కార్మికులు హాజరు పట్టిక, స్థానిక మునిసిపల్ కార్యాలయంలోనే వేయాలని, అయితే ఇటీవల కాలంలో ఆయా ప్రాంతాల్లోని సచివాలయ కేంద్రాలలో హాజరు పట్టిక వేస్తున్నారని దీని వలన అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో పాటు దుర్భర జీవితం గడుపుతున్న మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులకు జగనన్న కాలనీలో కానీ లేదా ఇతర ప్రాంతాల్లో కానీ నివాసాలను మంజూరు చేయాలని అందె నాసరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా సెక్రటరీ ఎస్‌కె కాశిం, రాష్ట్ర మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం ఉపాధ్యక్షులు టి హరి బాబు, జిల్లా సెక్రటరీ వేమా వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు చెన్నులు, ఎం.దరగయ్య, గొట్టిముక్కల బాబు పాల్గొన్నారు.

కనిగిరి : జనవరి 3 నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేపడు తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ అన్నారు. శనివారం కనిగిరి గార్లపేట రోడ్డులోని దర్శి చెంచయ్య భవన్ నుంచి పామూరు బస్టాండ్, ఒంగోలు బస్టాండ్ వరకు కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 28వ తేదీ పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కార్మిక సంఘాలు చర్చలు జరిపిన స్పష్టత రాలేదని, ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసేంతవరకు ప్రతి రోజు నిరసన తెలుపుతూ జనవరి 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె జరుగుతుందన్నారు. ప్రభుత్వం 12వ పీఆర్సీలో వేతనాలు పెంచుతామని, సెలవుల డబ్బులు ఇస్తామని, పెండింగ్ డిఏలు ఇంక్రిమెంట్లు కార్మికుల కార్మికుల ఖాతాలో వేయిస్తామని, పిఎఫ్, ఈఎస్ఐలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఆ హామీలను కార్మికులు నమ్మే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల సమ స్యలు పరిష్కరించకుండా చూస్తాం చేస్తామంటూ కాలయాపన చేస్తుందని మంత్రి ఇచ్చిన హామీ లను నిర్దిష్టమైన సర్కుల రూపంలో ఇవ్వాలని లేని పక్షంలో జనవరి 3వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ కనిగిరి నియోజకవర్గం అధ్యక్షుడు గుజ్జుల బాలిరెడ్డి, కనిగిరి మున్సిపల్ వర్కర్స్ యూని యన్ అధ్యక్ష కార్యదర్శులు కోటయ్య, సిహెచ్ అశోక్, నాసర్, కిరణ్, మస్తాన్, రత్తయ్య, ఖాసిం వలి, సుబ్రహ్మణ్యం, శేషయ్య, మధు, ఐజాక్, సామేలు, తాజుద్దీన్, జీవన్, రవి, ప్రసాద్, చంద్ర, అంజి, మాల కొండయ్య, దానియేలు, పౌలు పాల్గొన్నారు.

మంత్రి నివాసాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

విశాలాంధ్ర-మార్కాపురం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 18 రోజులుగా ఉద్యమాలు చేపట్టిన అంగన్‌వాడీలు శనివారం పట్టణంలోని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ నివాసాన్ని ముట్టడించారు. మహిళలు మంత్రి నివాసానికి పెద్ద సంఖ్యలో చేరుకోగానే పోలీసులు మహిళలను గేటు లోపలికి రాకుండా ఉండేందుకు తీవ్ర ప్రయత్నం చేసినప్పటికీ మహిళలు నెట్టుకొని లోపలికి వెళ్లారు. అనంతరం దాదాపు నాలుగైదు గంటల పాటు మంత్రి నివాసం బయట కూర్చొని ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య మాట్లా డుతూ అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోగా మరోవైపు ఉద్యమకారులను అవహేళనగా మాట్లాడటం దారుణమని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీ సమస్యలు పరిష్కరిస్తానని పదేపదే చెప్పిన జగన్ అధికారం అనంతరం మాట మార్చారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక లక్షా 5 వేల మంది అంగన్వాడీలు ఇంత పెద్ద ఎత్తున ఉద్యమ బాట పట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నేటికీ కూడా ప్రాథమిక స్థాయిలో చర్చలు కూడా జరపకపోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. ఒకవైపు సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం అందించాలని స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దానిని ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని లేనిచో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్‌కె కాశిం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేసన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి రేణుకాదేవి, టి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఓల ఖర్చులతో ప్రభుత్వ విధులు

- సొంత డబ్బులతో వీఆర్వోలు విధులు నిర్వహణ
- ఉన్నతాధికారులు పని ఒత్తిడి విధులన్నీ ఒకేసారి నిర్వహించమంటే ఎలా?

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రభుత్వం హడావిడిగా అసైన్మెంట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది కానీ వీఆర్వోలకు అధిక పని భారంతో ఉండటంతో ఒత్తిడి పెరిగిందని ఆడుదాం ఆంధ్ర, అంగన్వాడీ పాఠశాల నిర్వహణ, ప్రభుత్వ భూముల సందర్శన, గ్రామ సభల నిర్వహణ, పంచాయితీగా పరిధిలో సాధారణ విధులు నిర్వహణ తదితర కార్యకలాపాలు ఉండడంతో వీఆర్వోలు దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారని శనివారం వీఆర్ఓలు ఆవేదన చెందారు. జిల్లా మండల స్థాయి అధికారులు మాపై ఒత్తిడి పెంచుతున్నారని దానితోపాటు మా సొంత ఖర్చులతో విధులు నిర్వహించవలసి వస్తుందని అసైన్మెంట్ సెటిల్మెంట్ చేసేందుకు ఒక్కొక్క విఆర్ఓ బయట జిరాక్స్ తీస్తే ఒక కాపీ ఖర్చు 3 రూపాయలవుతుందని ఒక రైతు భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించేందుకు తయారు చేసే మొత్తం జిరాక్స్ చెట్టుకు 30 రూ.ల అవుతుందని ఒక్కొక్క గ్రామంలో దగ్గర 200 వరకు లబ్ధిదారులు ఉంటారని రాత్రిం బవళ్లు పనిచేయవలసి వస్తుంది. ఒత్తిడిలో మా కుటుంబంలో సైతం మర్చిపోవాల్సి పరిస్థితి ఏర్పడిందని ఇక పండగలు పబ్బలకు పబ్బులు అంటారా వాటి ఊసే లేదని అవస్థలు పడు తున్నామని ప్రభుత్వ ఉన్నతాధి కారులు మాపై ఒత్తిడి తగ్గించాలని వేడుకుంటున్నామని వీఆర్ఓలు విశాలాంధ్ర ప్రతినిధికి తెలి పారు. ప్రభుత్వం ఇలానే హడావిడిగా చేస్తే మేము విధుల నుండి తప్పుకుంటామని అవసంమైతే ఆందోళన చేపడతామని తెలిపారు.

లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

- ప్రతిరోజు తాగునీరు టీడీపీతోనే సాధ్యం
- 4 సంవత్సరాలు 9 నెలల కాలం అధికార వైసీపీ ఏం చేస్తుందో చెప్పాలి
- ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి బాలినేనికి పేద బతుకులు కనిపించ లేదా
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల ధ్వజం

విశాలాంధ్ర-ఒంగోలు : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు వెంటనే అందిస్తామని, అలాగే ఒంగోలు దగ్గర వాసులకు ప్రతిరోజు తాగునీరు అందిస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు హామీ ఇచ్చారు. ఒంగోలు నగర పరిధిలోని చింతల వద్ద టిడ్కో గృహ నిర్మాణ సముదాయం వద్ద టిడ్కో గృహ లబ్ధిదారులతో దామచర్ల శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు టీడీపీ పార్టీ ఒంగోలు నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దామచర్ల ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి పేదల ఇళ్ల నిర్మాణం పట్ల చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ హయాంలో 80% పూర్తయిన టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారిగా అందించడంలో పూర్తిగా వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక వసతులు కల్పించేందుకు అధికార వైసిపికి నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల సమయం సరిపోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు నగరంలో 6వేల ఇల్లు మంజూరు చేయడమే కాకుండా తెలుగు దేశం పార్టీ నిర్మాణం కూడా చేపట్టింది అన్నారు. 80 శాతం పూర్తయిన ఈ ఇళ్లను పూర్తి చేసేందుకు అధికార వైసిపికి చిత్తశుద్ధి లేదన్నారు. అలాగే ఆ భూమి అభివృద్ధి పేరుతో ఖర్చు చేసిన రూ.34 కోట్ల రూపాయలు ఎవరు ఇస్తారో చెప్పాలన్నారు. ఎర్రజర్ల కొండను తవ్విన మట్టి ఎక్కడికి తరలించారో చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో గృహాలు అందించడంతో పాటుగా, ప్రతిరోజు తాగునీరు అందిస్తామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంలో ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమానికి ముందుగా లబ్ధిదారులు తమ గోడును దామచర్ల ముందు వేడబోసుకున్నారు. ఇబ్బందులు పడి అప్పులు చేసి, బంగారాన్ని బ్యాంకులలో పెట్టి టిడ్కో గృహాల కోసం నగదు చెల్లించామని, అప్పటినుంచి గృహాలు రాక అద్దె ఇళ్లల్లో మగ్గుతున్నామని, ఇది చాలా పడినట్టు బ్యాంక్ అధికారుల వేధింపులు పెరిగాయని వాపోయారు. వచ్చే ఎన్నికలలో టీడీపీని గెలిపించుకుని తమ సమస్యలు పరిష్కరించుకుంటామని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వైవీ.సుబ్బారావు, కార్పొరేటర్ దాచర్ల రమణయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, టీవీ శ్రీరామమూర్తి, కుసుమ కుమారి, ఆర్ల వెంకటరత్నం, నాలం నరసమ్మ, టీ అనంతమ్మ, అజి మునిసా, నల్ల పోతుగంగాధర్, ముత్తన శ్రీనివాసరావు, అక్కయ్య రాజు, పశువులేటి సునీత, గంగవరపు పద్మ పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

దగ్ధమవుతున్న బ్యారెన్‌ను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పూర్తిగా దగ్ధమైన పొగాకు.

5 లక్షల ఆస్తి నష్టం.

విశాలాంధ్ర-తాళ్లూరు: ప్రమాదవశాత్తు పని జరుగుతున్న బ్యారెన్ దగ్ధమైన సంఘటన శనివారం మండలంలోని చంద్రగిరి వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం చంద్రగిరి గ్రామానికి చెందిన గంగిరెడ్డి పెదకొండ గురువారెడ్డి కి చెందిన పొగాకు బ్యారెన్ ను వితలాపురం గ్రామానికి చెందిన పొగాకు రైతు నవులూరి సురేంద్రమోహన్ రావు బాడుగకు తీసుకుని పొగాకు కాల్పును ప్రారంభించారు. అయితే శనివారం బ్యారెన్‌కు చెందిన ఒక టైరు పేలిపోవడంతో దానితో మంట ధాటికి బ్యారన్ మొత్తం తగులబడి పోయింది. ఇది గమనించిన గ్రామస్తులు మండుతున్న మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. తదుపరి ఫైర్ ఇంజన్ వారికి సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే బేరం పూర్తిగా దగ్ధం అయిపోవడం, దానిలోని పొగాకు రైతుకు సంబంధించిన 2 లక్షల ఖరీదు కలిగిన పొగాకు కాలిపోవడంతో పాటు, 3 లక్షల రూపాయల ఖరీదు కలిగిన బేరన్‌కు చెందిన సామాను కూడా దగ్ధమైపోయింది. దీంతో పొగాకు రైతు నవులూరి సురేంద్ర మోహన్‌రావు కు 5 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. దీంతో రైతు కుటుంబం దుఃఖసాగరంలో మునిగి పోయింది. అధికారులు, ప్రభుత్వం స్పందించి నష్ట పరి హారం చెల్లించి ఆదుకోవాలని స్థానికులు భావిస్తున్నారు.

కిసాన్ సమ్మేళన వేడుకల కార్యక్రమం

విశాలాంధ్ర-కురిచేడు : మండలంలోని బోధనంపాడు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ మరియు ఎఫర్ట్ వారి ఆధ్వర్యంలో కిసాన్ సమ్మేళన వేడుకలు నిర్వహించడం జరిగింది. రిలయన్స్ ఫౌండేషన్ ఎఫెక్ట్ సంస్థల ఆధ్వర్యంలో ధీరుభాయి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎఫర్ట్ సంస్థ పనిచేయుచున్న మండలాలలో కిసాన్ సమ్మేళనలు నిర్వహించడం జరిగిందని గత రెండు సంవత్సరాల నుండి జిల్లాల్లో పలు మండలాలలో అనేక రకాలైన అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందని గ్రామాలలో త్రాగునీరు సాగునీరు పాడి పరిశ్రమ అభివృద్ధికై ఎంతగానో పాటు పడుతూ అనేక గ్రామాల్లో మంచి నీటి కొరతను పశు గ్రాసం కొరతను తగ్గించింది. మహిళలకు వారి కాళ్ళ మీద వారు నిలబడే విధంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ రోజున ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి ముఖ్య కారణం ధీరుబాయ్ అంబానీ పుట్టినరోజు దినాన్ని పురస్కరించుకొని మహిళలకు పలు ఆట పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎఫెక్ట్ టీం జెస్సి గ్లోరీ గ్రామ సర్పంచి రామాంజనేయులు మహిళలు పాల్గొన్నారు.

చెంచు గిరిజనులు జనవరి 5 లోపు దరఖాస్తులు చేసుకోవాలి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన పథకాలకు చెంచు గిరిజనలు తమకు అవసరమైన పథకాలు జనవరి 5వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని, గిరిజన శాఖ అభివృద్ధి సెంట్రల్ టీం తెలియజేశారు. శనివారం మండలంలోని నల్లమల అడవి ప్రాంతంలో గల మర్రిపాలెం చెంచు గిరిజన గూడెంలో గిరిజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎం- జన్ మన్(మంత్రి జన జాతి న్యాయ మహ అభియాన్) కార్యక్రమంలో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ - న్యూఢిల్లీ నుంచి అధికారి కుంజ్ బిహారీ దోర్నాల మండలం మర్రిపాలెం చెంచుగూడెంలో ఉన్న గిరిజన ప్రజలతో ముఖాముఖి నిర్వహించి పీఎం జన్ మన్ సర్వే జరిగే విధానం గురించి వాళ్లకు ఉన్నటువంటి అవసరాల గురించి కేంద్ర ప్రభుత్వం నుండి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలు గురించి వివరిస్తూ విద్య, వైద్యం, పక్కా గృహాలు మొదలగు అవసరాలు అన్ని కూడా ఈ పథకం ద్వారా పొందవచ్చునని తెలియజేశారు. ఈ సర్వే తేదీ 05.01.2024 వరకు జరుగుతుందని అప్పటిలోగా వారి యొక్క అవసరాలు సర్వేలో పొందుపరచుకొని ఈ పథకాన్ని అందరూ ఉపయోగించుకునే విధంగా చూసుకోవా లని తెలియజేశారు. అక్కడ చెంచు గిరిజనులు తమ సమస్యలను కార్లకు వెళ్లపుచ్చుకున్నారు. గిరిజన అభి వృద్ధి శాఖ ఆంధ్రప్రదేశ్ నుంచి హరి కృష్ణ, పి.య.యు ఫీల్డ్ ఆఫీసర్ మధుసూదన్, డి.యల్.డి.ఓ సాయి కుమార్, ఐటీడీఏ శ్రీశైలం నుండి అదనపు పీఓ ధనుంజయ రావు, ఐటీడీఏ యస్.ఓ నాగేశ్వరరావు,, ఏ.పి. ఓ వినయ్ కుమార్, డిప్యూటీ డాక్టర్ శ్రీనివాస రావు, చెంచు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు బూచేపల్లి న్యూఇయర్ కానుక

విశాలాంధ్ర-దర్శి : జిల్లా పరిషత్ చైర్మన్ వెంకాయమ్మ, బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి దర్శి మండల ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు నూతన సంవత్సర కానుకను అంద జేశారు. ప్రతినిధి సంధిరెడ్డి నరేందర్‌రెడ్డి విలేకరులందరికీ న్యూఇయర్ క్యాలెండర్, డైరీ, స్వీట్లు అందజేశారు. జనవరి 1వ తేదీన మాజీ శాసన సభలో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకా యమ్మ దర్శిలో ప్రజలకు అందుబాటులో ఉంటారని నరేంద్ర తెలిపారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తాళ్లూరు : మండల కేంద్రమైన తాళ్లూరు లోని మానవ వనరుల కేంద్రం వద్ద శనివారం మండల విద్యాశాఖ అధికారులు గురజాల సుబ్బయ్య, ఎల్. సుధాకర్‌రావులు యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు నాగరాజు, యూటీఎఫ్ బాధ్యులు ఐ హనుమారెడ్డి, జి. కొండయ్య, స్వామి దాసు, నాగిరెడ్డి, సి వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, శ్రీనివాసరావు, శివరామిరెడ్డి, ఖాసిం సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

పీఎంఈజీపీ రుణాల ద్వారా పాడి గేదెలు కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : వైయస్సార్ క్రాంతి పదంలో పీఎంఈజీపి ద్వారా పాడి పశువుల యూనిట్లకు రుణాలు ఇప్పించాలని వైయస్సార్ క్రాంతి పదం ఏరియా కోఆర్డినేటర్ ఎం వసుంధర దేవి అన్నారు. స్థానిక వైయస్సార్ కాంతి పదం కార్యాలయంలో శనివారం వివో ఎల్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివోఏలు గ్రామాలలో సకాలంలో సమావేశాలు నిర్వహించాలన్నారు. నాలుగో విడత ఆసరా బయో మెట్రిక్ వేయించాలన్నారు గ్రామాల్లో జరిగే అంగన్వాడీ కేంద్రాల మీటింగ్లలో పాల్గొనాలని అన్నారు. వి ఆర్ ఎఫ్, ఉన్నతి, స్త్రీ నిధి, సిఐఎఫ్, రికవరీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకెపి ఎపిఎం ఎం హనుమంతరావు, మండల సమైక్య ఉపాధ్యక్షురాలు సన్నపునేని లక్ష్మి, వై కె పి సి సి మోహనరావు, గురవయ్య, అకౌంటెంట్ జి మార్తమ్మ, పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకల్లో పోలీసుల ఆంక్షలు తప్పనిసరి పాటించాలి

విశాలాంధ్ర-పీసీపల్లి : నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని మండల ప్రజలు పోలీసుల ఆంక్షలను పాటించాలని స్థానిక ఎస్సై జి కోటయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని రెస్టారెంట్లు బార్లు వైన్ షాపులు పోలీసులు విధించిన ఆంక్షలు మేరకే అనుసరించి నడపాలని యువకులు ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసివేసి పెద్ద పెద్దగా సౌండ్ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సరం వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మండల ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మండల ప్రజలందరూ నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు ఎస్సై జి కోటయ్య తెలియజేశారు.

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వం

విశాలాంధ్ర-దర్శి: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించలేని అసమర్ధ ప్రభుత్వం మరొకరంగంలో పనిచేసే చిరుద్యోగులతో పోటీగా అంగన్వాడీ సెంటర్లను తూతూమంత్రంగా నడుపు తోందని రైతుసంఘం దరిశి డివిజన్ కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు విమర్శించారు. ఇతర చిరుద్యోగులతో సెంటర్లను నడపటానికి నిరసనగా దరిశి సీడీపీఓ ఆఫీసు వద్ద నుండి అంగన్వాడీలు, ఆయాలు ప్రదర్శనగా వచ్చి నగరపంచాయితీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలు 19 రోజులుగా కనీస వేతనాలు,రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటీ చెల్లింపు వంటి న్యాయమైన డిమాండ్లపై సమ్మె చేస్తుంటే ఇతర డిపార్ట్మెంట్‌లలో చిరుద్యోగులుగా పనిచేస్తున్న సచివాలయం, వీఓఏ, వాలంటీర్లు మున్సిపల్ సిబ్బందితో సెంటర్ల తాళాలు పగులగొట్టి సెంటర్లు నడిపిస్తున్నారని, అయినా లబ్దిదారులను బాలింతలు, గర్భిణీలు, పిల్లలకు న్యాయం జరగటం లేదని, సెంటర్లు మూతబడతున్నాయన్నారు. ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ఎ.తిరుపతమ్మ, అచ్చమాంబ, సుబ్బరత్నం, విశ్వవాణి, లక్ష్మి,వెంకటరమణ, బాలమ్మ, నాగమణి, సుజాత, నాగమల్లేశ్వరి, పిఎన్ ఎమ్ నాయకులు ఉప్పు మోహనరావు, పాల్గొన్నారు.

భావితరాల కోసం సమావేశంలో పాల్గొన్న చాట్ల దానియేల్

విశాలాంధ్ర-కంభం : శనివారం దండు వీరయ్య మాదిగ ఆధ్వర్యంలో రేపటి భావితరాల భవిష్యత్తు కోసం మాదిగ, రెల్లి, ఉపకులాల, మేలుకొలుపు కోసం ఆంధ్రప్రదేశ్ ఎంఆర్పిఎస్ అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఒంగోలు సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి అన్ని జిల్లాల నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షులు దండు.వీరయ్య మాదిగ మాట్లాడుతూ జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకు 15 అసెంబ్లీ స్థానాలు, 2 ఎంపీ స్థానాలు అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలా జరగని పక్షంలో మాదిగల సత్తా ఏమిటో చూపి స్తామని తెలియజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల దాని యేలు మాదిగ, సిహెచ్.జాన్,జి. బాబు,జి.చిన్నవి. శ్యాం బాబు, సిహెచ్. రమేష్, ఎం.వందనం,ఎం.అశోక్, ఎం.సామేలు, కె.చిన్న, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికులకే అవకాశం ఇవ్వాలి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల: ఎర్రగొండ పాలెం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికులకే అవకాశం ఇవ్వాలని, ఏవియం మిషన్ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకులు జినుకూటి జాన్ బాబు తెలిపారు. యర్రగొండ పాలెం శాసన సభ్యునిగా పోటీ చేయుటకు అవకాశం కల్పించాలని కోరుతూ అభ్యర్ధన, నేను వైసీపీ ఆవిర్భావం నుంచి కూడా పార్టీలో సేవలు చేస్తే కొనసాగుతున్నాను. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నుంచి వైసీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు నాకు అవకాశం కల్పించాలని, నా సేవలను గుర్తించి స్థానికంగా ఉండే నాకు ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు కేటాయించాలని కోరుతున్నాను.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిగెలుపే లక్ష్యంగా పని చేయాలని మార్కాపురం టిడిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గొట్లగట్టు ఎస్సీ కాలనీ నాయుడుపేట ఎస్సీ కాలనీ వెలుగొండ రాయుడు పాలెం ఎస్సీ కాలనీ చినమనగుండం ఎస్సీ కాలనీలలో పర్యటించి మాట్లాడారు. మండల టిడిపి అధ్యక్షుడు ఏం బాబు రావు ఏఎంసీ మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు పెరికే సుకుదేవ్, కేశవులు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెయింట్ మార్క్స్ స్కూల్‌లో ముందస్తు న్యూఇయర్ వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : స్థానిక సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, నందు శనివారం ముందస్తు నిర్వహి ంచిన నూతన సంవత్సర వేడుకలలో విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాత సంవత్సరానికి వీడుకోలు పలుకుతూ నూతన సంవత్సరంలోకి ఆహ్వానం పలుకుతూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులు నూతన ఉత్తేజంతో పాల్గొని మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు ఇటు పాఠశాలకు మంచి తీసుకొని రావాలని కరస్పాండెంట్ యం.జయకుమార్ ఆకాంక్షించారు.

నవరత్నాలు నవ మోసాలయ్యాయి

- జగన్మోహన్ రెడ్డి హామీల అమలులో 85% ఫెయిల్ అనే పుస్తక ఆవిష్కరణ
- జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ

విశాలాంధ్ర-ఒంగోలు: జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన నవరత్నాల హామీల అమలులో ఘోరంగా విఫలమయ్యారని తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాన బాలాజీ పత్రికా సమావేశంలో విమర్శించారు. ఈ సమావేశ కార్యక్రమంలో జగన్ రెడ్డి ప్రకాశం జిల్లాకు చేసిన హామీలు ఇచ్చి అమలు చేయకుండా తదితర వివరాలకు సంబంధించిన బుక్లెట్ ను ఆవిష్కరణ కార్యక్రమం రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులతో విడుదల చేశారు. జగన్మోహన్ రెడ్డి హామీల అమలలో 85% ఫెయిల్ అనే పుస్తకాన్ని ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జిల్లా,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూకసాని బాలాజీ గారు మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చేసినటువంటి పాదయాత్రలో గాని,అనేక సభలు పెట్టి ఇచ్చినటువంటి వాగ్దానాలను ఎన్నికల మేనిఫెస్టో ప్రకటిస్తున్నానని చెప్పడం జరిగిందని అన్నారు. మాట తప్పను మడమ తిప్పను అని అనేకమైనటువంటి వాగ్దానాలు చెప్పి ప్రజలను నమ్మించి ఓట్లేపించుకొని అధికారంలోకి వచ్చాక ఆ హామీలు పూర్తిగా మరిచారన్నారు. ప్రధానంగా ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీలు వ్యవసాయం, పాడి పరిశ్రమ, నీటిపారుదల, పోర్టులు, బీసీ సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం, విద్యుత్, ఆరోగ్యం, మైనింగ్, త్రాగునీరు, ఫ్లోరైడ్ సమస్య, తదితర సమస్యల పరిష్కారం కోసం జగన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయకుండా విఫలమయ్యారని ప్రజలను మోసం చేశారని అన్నారు. ప్రకాశం జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టులైన రామతీర్థం ప్రాజెక్టు, గుండ్లకమ్మ ప్రాజెక్టు, వెలు గొండ ప్రాజెక్ట్, రాళ్లపాడు ప్రాజెక్టు, సోమ శీలా ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు. ఫ్లోరైడ్ నుంచి కనిగిరికి విముక్తి కల్పిస్తానని ఫ్లోరైడ్ సమస్య తీర్చలేదు, గ్రానైట్ కార్మి కుల కోసం చీమకుర్తిలో ఈఎస్ఐ హాస్పి టల్ నిర్మిస్తామని చెప్పారు కానీ కట్టించ లేదు,గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలకు రాయల్టీ 40 శాతం సబ్సిడీ ఇస్తానని చెప్పి, రాయల్టీలో సబ్సిడీ ఇవ్వక పోగా పెంచారు. గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలకు విద్యుత్ యూనిట్ 7.35 నుండి 3.75కి తగ్గిస్తా నని చెప్పి తగ్గించ పోగా కోట్లాది రూ.లు పెనాల్టీలు వేశారు. మార్కాపురం, పొదిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. ప్రకాశం జిల్లా నుంచి కరువు తరిమి కొడతానని చెప్పి హామీలను అమలు చేయలేదు. దివ్యాంగుల సంక్షేమం కోసం వికలాంగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి వాటిని అమలు చేయలేదన్నారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు కామేపల్లి శ్రీనివాసరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి పొదిలి శ్రీనివాసరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరి వెంకటే శ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శులు కేసన శేషమ్మ, గంగవరపు పద్మావతి, జిల్లా మీడియా కోఆర్డినేటర్ బెజవాడ మురళీ కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి గవదగట్ల హరికృష్ణ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై తక్షణమే దృష్టి సారించాలి - కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : వచ్చే సాధారణ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై తక్షణమే దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగించే భవనాలకు చెందిన శాఖల అధికారులతో శనివారం ఆయన ప్రకాశం భవనంలోని తన ఛాంబరులో సమీక్షించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఫర్నీచర్, పోలింగ్ గదిలోనూ, ఓటర్లు వరుసలో నిలబడే ఆ ప్రాంగణంలోనూ తగిన విధంగా విద్యుత్ సౌకర్యం - లైటింగ్, తాగునీరు, టాయిలెట్స్, వికలాంగుల కోసం ర్యాంపు సదుపాయాలపై ఆయన ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాలకు వినియోగిస్తున్న భవనాలలో పాఠశాలలు, కళాశాలలు, వ్యవసాయ, జిల్లా పరిషత్, ఆర్.డబ్ల్యు.ఎస్., మున్సిపల్, పంచాయతీరాజ్, వివిధ సంక్షేమ శాఖలకు చెందినవి ఉన్నందున ఎన్నికల సెక్టార్ ఆఫీసర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులు కూడా వీటిని తనిఖీ చేసి వెంటనే నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట శాశ్వత ప్రాతిపదికన వీటిని ఏర్పాటు చేసేందుకు బడ్జెట్ అంచనాలను కూడా ఈ నివేదికలో పొందుపరచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విధమైన ఏర్పాట్లు చేసేందుకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి జనవరి 3వ తేదీన లేఖ రాస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీ. కె.శ్రీనివాసులు, డి.ఆర్.ఓ. శ్రీమతి ఆర్. శ్రీలత, జడ్పీ సి.ఈ.ఓ. జాలిరెడ్డి, మార్కెటింగ్ ఏ.డి. ఉపేంద్ర, డి.ఈ.ఓ. వి.ఎస్.సుబ్బారావు, ఆర్.ఐ.ఓ. సైమన్ విక్టర్, ఐ.సి.డి.ఎస్. పి.డి. మాధురి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాధరావు, జిల్లా బి.సి. సంక్షేమ అధికారి అంజల, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, పశు సంవర్ధక, పంచాయతీరాజ్, ఆర్ . డబ్ల్యు.ఎస్., అటవీ శాఖ అధికారులు, జిల్లా ఎన్నికల విభాగ సూపరిండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్మాణం గత ప్రభుత్వ బాధ్యత

- టిడ్కో గృహ నిర్మాణాలపై మేయర్ గంగాడ సుజాత
- టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించిన గంగాడ



విశాలాంధ్ర-ఒంగోలు : టిడ్కో గృహాల నిర్మాణం మా బాధ్యత కాదు, హామీ ఇచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమే, పూర్తి చేయలేకపోవడం వారి వైఫల్యమే అంటూ ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీచేపట్టిన టిడ్కో గృహ సముదాయం కార్యక్రమానికి దీటుగా ఒంగోలు నగర మేయర్ నగర పరిధిలోని బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వారు 80 శాతం నిర్మిస్తే మిగిలిన 20 శాతం మేము ఎందుకు నిర్మించాలని ప్రశ్నించారు. వాటి పూర్తి నిర్మాణం పూర్తి బాధ్యత తెలుగుదేశం పార్టీదే అన్నారు. వాళ్లు నిర్మించకపోతే మేమెందుకు నిర్మించాల న్నారు. మౌలిక సదుపాయాలు కల్పించలేని పరిస్థితి తెలుగు దేశం అన్నారు. దీనిపై మీడియా అడిగిన ప్రశ్నలకు సమా ధానం చెబుతూ మేము పేదల పక్షం అన్నారు. కేవలం ఒక్క రూపాయికే ఇల్లు ఇచ్చామన్నారు. అయితే టిడ్కో గృహాలు తమ బాధ్యత కాదన్నా వైసిపి ఆ నిర్మాణాలపై వైసీపీ రంగులు ఎందుకు వేశారో మాత్రం సమాధానం దాటవేయటం విశేషం.

జనవరి 2న దళిత, గిరిజన, క్రైస్తవ సంఘాలతో సమాలోచన

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకరరెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : జనవరి 2వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత, గిరిజన, క్రైస్తవ సంఘాలతో కాంగ్రెస్ పార్టీ సమాలోచన అనే కార్యక్రమాన్ని ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈదా మాట్లాడుతూ జనవరి 2 వతేది మధ్యాన్నం 3 గంటలకు ఒంగోలులోని అంబెడ్కర్ భావన్‌లో దళిత, గిరిజన, క్రైస్తవ సంఘాల నాయకులతో కాంగ్రెస్ పార్టీ సమాలోచన సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి సీడబ్ల్యుసీ సభ్యులు కొప్పుల రాజు, కేంద్రమాజీమంత్రి జెడిశీలం, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సిరివెళ్ల ప్రసాద్ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు సాకే శంకర్, పీసీసీ సమన్వయ కమిటీ సభ్యులు కొరివి వినయ్ కుమార్ రాష్ట్ర నాయకులూ పాల్గొంటారని తెలిపారు. కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం పేదలకు, దళిత, గిరిజన, బలహీన వర్గాలకు వ్యతిరేకమైన విధానాలను అమలుచేస్తున్నదని, ప్రజల మధ్యన విద్వేషాలను రగిలిస్తున్నదని, భారత రాజ్యాంగ స్ఫూర్తిని, విలువలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలను బలహీపరుస్తున్నదని తెలిపారు. బీజేపీ పాలన కొనసాగితే భారత రాజ్యాంగ అస్తిత్వమే కోల్పోయే ప్రమాదం ఉందని, దీనికి తోడు రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బీజేపి విధానాలకు అండగా నిలుస్తుండటం దురదృష్టకరం అని, ప్రత్యేక తరగతి హోదాతో పాటు రాష్ట్ర హక్కులపై ప్రశ్నించలేని దుస్థితిలోకి రెండు పార్టీలు నెట్టబడ్డాయని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్ష ణకు, మరియు దళిత, గిరిజన, క్రైస్తవ ప్రజల హక్కుల పరిరక్షణకు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలోని ప్రత్యేక కమిటీ.. రాష్ట్రంలోని దళిత, గిరిజన, క్రైస్తవ సంఘాల నాయకులతో, మేధావులతో రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటు చేసి మొదటగా ప్రకాశం జిల్లాలో సమాలోచలు జరపాలని నిర్ణయించి మొదటి దశలో జనవరి 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ ప్రకాశం నుండి శ్రీకాకుళం జిల్లా వరకూ సమావేశాలు జరుగుతాయని తెలిపారు.ఈ సమాలోచనల్లో భాగస్వాములు కావాలని, ప్రకాశం జిల్లాలో జరుగుతున్న సమావేశానికి దళిత, గిరిజన,క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉద్దండి మల్లికార్జునరావు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ మోషే ,రాష్ట్ర నాయకులూ రంగనాయకులు ,రాజశేఖర్, రసూల్ పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

వైసీపీ నాయకులు ముంగమూరి శ్రీనివాసులు

విశాలాంధ్ర-మార్కాపురం : రాష్ట్ర వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశిస్తే వెనుకబడిన యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆ పార్టీ నాయకులు పట్టణ 5వ వార్డు మునిసిపల్ కౌన్సిలర్ ముంగమూరి శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం క్రియాశీలకంగా పనిచేస్తూ వచ్చానని, కావున తనకు ఎమ్మెల్యే టిక్కెట్టు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరానని అన్నారు. టిక్కెట్టు గురించి ఇప్పటికే పార్టీ అగ్రనాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితర పెద్దల దృష్టికి కూడా తీసుకెళ్లానని వారంతా సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు. నా స్వస్థలం పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి గ్రామం అని, పుట్టిపెరిగిన ప్రాంతం కావడంతో నియోజకవర్గంలో విస్తృతంగా బంధుగలం ఉందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రెండవసారి అధికారంలోకి రాబోతుందని అలాగే ముఖ్యమంత్రి జగన్ మరలా రావడం ఖాయమని వైసీపీ నాయకులు ముంగమూరి శ్రీనివాసులు అన్నారు.

చిల్లచెట్లతో విద్యార్థులు ఇబ్బందులు - సమస్యను పరిష్కరించిన సర్పంచి చెన్నమ్మ

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండల కేంద్రంలో ఉన్నటువంటి కస్తూరిబా గురుకుల పాఠశాల రహదారి చిల్ల చెట్లతో అధ్వానంగా తయారైయింది. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయులు రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొ ంటున్న నేపథ్యంలో ఈ సమస్యను స్థానిక సర్పంచి దుగ్గెం చెన్నమ్మ దృష్టికి తీసుకొని రావడంతో వెంటనే సర్పంచ్ స్పందించి రాష్ట్ర పురపాలక మరియు పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశాల మేరకు రహదారి ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగి ంచడం జరిగింది. పెద్దారవీడు మండల విభజన విభాగ యూత్ అధ్యక్షులు దుగ్గెం దినేష్, పెద్దారవీడు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రహదారి వద్దకు వెళ్లి విద్యార్థులకు రైతులకు ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో రహదారిని జేసీబీ సహాయంతో శుభ్రం చేయడం జరిగింది.

నారాయణస్వామిని దర్శించుకున్న దారపనేని

విశాలాంధ్ర-పామూరు : సీఎస్‌పురం మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీ మిట్టపాలెం నారాయణ స్వామిని శనివారము కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం సకల భోగ భాగ్యాలకు నిలయమని, అష్టైశ్వర్యాలు, ఆయు రారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తులకు అపారమైన నమ్మకం అని, ఉభయ తెలుగు రాష్ట్రాలలో నారాయణస్వామి వారి పేరు మీద వాణిజ్య రంగంలో ఎన్నో వ్యాపారాలు నిర్వహిస్తు, దిగ్విజయంగా కొనసాగుతు న్నారని, స్వామివారిని దర్శించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దారపనేని పేర్కొన్నారు. పోతిరెడ్డి తిరుపతిరెడ్డి, దారపనేని నరసింహ నాయుడు, మట్లె రాహుల్ యాదవ్, జాజం హరికృష్ణ నారాయణ స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

జనవరి 16న ఉమ్మడి రాష్ట్ర స్థాయి బండలాడుగు ఎడ్ల పందేలు

విశాలాంధ్ర-ఒంగోలు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 16వ తేదీన కొత్తపట్నంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బండలాగు ఎడ్లపందాలు నిర్వహిస్తున్నట్లు కొత్తపట్నం మాజీ జెడ్‌పిటిసి మేడా సుబ్బారావు ఒక ప్రకట నలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.1లక్ష, రెండవ బహుమతిగా రూ.50వేలు, మూడవ బహుమతిగా రూ. 25వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు ప్రారంభిస్తారన్నారు. బండ వెంట కేవలం 6గురు వ్యక్తులనే అనుమతిస్తున్నట్లు, ఎడ్లను కర్రతో కొట్టటంగాని, తోక విరవటం గాని చేయరాద న్నారు. పోటీలకు వచ్చే ఎడ్లకు నీడ, నీటి వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజుగా రూ.వెయ్యి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9948124772, 9676919195 లను సంప్రదివచాలని కోరారు.

పొగ మంచుతో ముండ్లమూరు



విశాలాంధ్ర-ముండ్లమూరు: మండల కేంద్రమైన ముండ్లమూరు తోపాటు పసుపుగల్లు, ఉల్లగల్లు, తమ్మలూరు, నాయుడుపాలెం, వేంపాడు, పోలవరం, శంకరాపురం, ఉమామహే శ్వరపురం తదితర గ్రామాలలో శనివారం తెల్లవారు జామున 4:00 నుండి విపరీతంగా కురుస్తున్న మంచు గ్రామాలలో కమ్ము కోవడంలో మంచు దుప్పటి కప్పినట్లు కనిపిస్తోంది. మంచుతో రహదారులు కమ్ముకుంటున్నాయి. తెల్లవారు జాము నుంచి దట్టమైన మంచు కురుస్తూ రహదారులను కమ్మేస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహన చోధకులు నానా అవస్థలు పడుతున్నారు.

మహా సభలకు సహకరించిన వారికీ ధన్యవాదాలు

విశాలాంధ్ర-త్రిపురాంతకం : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా 14వ మహాసభలకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు అని సీపీఐ నాయకులు, మండల కో ఆప్షన్ సభ్యులు నయీం బెగ్ అన్నారు.మహా సభలకు విచ్చేసి సమాజంలో రైతులు పడుతున్న ఇబ్బందులు, వాటిని ఎలా ఎదుర్కోవాలో చెప్పి ఉత్తేజపరిచిన నాయకులకు ధన్యవాదాలు అన్నారు. తమ పాటలతో రైతులను ఆకట్టుకున్న కళా నాట్య మండలి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. మహాసభలు విజయవంతం కావడానికి సహకరించిన దాతలకు, ఉద్యోగులకు, నాయకులు, రైతులకు ధన్యవాదాలు తెలిపారు.

టి.సి.యస్ జాతీయస్థాయి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన శ్రీసాధన విద్యార్థులు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : సుప్రసిద్ధ బహుళజాతి సంస్థ టి.సి.యస్ దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ క్వాలిఫయర్ టెస్ట్‌లో శ్రీసాధన విద్యార్థులు పన్నెండు మంది ఉత్తీర్ణత సాధించారని శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తెలిపారు. డిగ్రీ 6వ సెమిస్టర్ బి.యస్.సి యం.పి.సి. విభాగం నుండి పోలెబోయిన యమున, షేక్ భాధర్ బాషా, యం.యస్.సి.యస్ విభాగం నుండి అరికట్ల పవిత్ర, కటారి త్రిష కోలగట్ల పవిత్ర, నల్లమేకల నీలిమ, తంగిరాల వెంకట నాగమణి, ఉప్పు భావన, వల్లూరి శ్రావణి, జూపల్లి లక్ష్మి, బి.యస్.సి బి.ఆర్.సి విభాగం నుండి దేవలూటి వెంకటేశ్వర్లు, బి.కామ్ కంప్యూటర్స్ విభాగం నుండి షేక్ అర్షద్ ఈ జాతీయస్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైనారని 6వ సెమిస్టర్ ముగిసేలోగా టి.సి.యస్ సంస్థ వారిని టెక్నికల్ మరియు హెచ్. ఆర్ రౌండ్ల ద్వారా వడపోత నిర్వహించి నియామక పత్రాలను అందజేస్తుందని ప్రిన్సిపల్ కె. మధుసూదన్ అన్నారు. కళాశాల క్యాంపస్ రిక్రూట్మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం సమన్వయకర్త కె.వి.యస్.ఆర్. పవన్ కుమార్ మాట్లాడుతూ 2014 వ సంవత్సరము నుండి ప్రతిఏటా కంప్యూటర్ సైన్సు, బయాలజీ, కెమిస్ట్రీ మరియు కామర్స్ విద్యార్థులు యన్. క్యూ.టి కి రిజిస్ట్రేషన్ చేసుకొని ఉత్తీర్ణత సాధించడమే. కాక ఉద్యోగ నియామక పత్రాలు అందుకుని టి.సి.యస్ సంస్థలో ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని యన్.క్యూటి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు టి.సి.యస్ కు అనుబంధంగా పనిచేసే 2000 పైచిలుకు సాఫ్ట్వేర్ సంస్థలలో ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తోపాటు డైరెక్టర్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ రాజగోపాల్రెడ్డి, ఎం.వి కృష్ణారెడ్డి, వి.ఆర్.కె ప్రసాద్, డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి, జి.యల్ రమేష్‌బాబులు, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్ కుమార్, క్యాంపస్ అండ్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ విభాగం సమన్వయకర్త కె. పవన్ కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ యమ్. శేషుకుమార్, కళాశాల ఇన్చార్జ్ డాక్టర్ పి.ఆర్.కె ప్రసాద్, కామర్స్ విభాగ అధ్యాపకులు ఓ. ఏడుకొండలు, పి.బాబు, కెమిస్ట్రీ విభాగాధిపతి పి.శ్రీధర్, గణిత విభాగాధిపతి జె రాము, సంఖ్యక శాస్త్ర విభాగాధిపతి బి పోలిరెడ్డి, కంప్యూటర్సైన్సు ఉపన్యాసకులు యమ్.వి. రాఘవేంద్ర, హెచ్ శ్రీలక్ష్మి ఇతర అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

యుటిఎఫ్ క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరు మండలం యుటిఎఫ్ 2024వ నూతన సంవత్సరం సంబంధించి క్యాలెండర్ డైరీని స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద శనివారం మండల విద్యాశాఖ అధికారి(1) జే సుబ్బారావు మండల విద్యాశాఖ అధికారి(2) కే వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కావూరి దేవరాజు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గోగుల కోటేశ్వరరావు, యుటిఎఫ్ ఉపాధ్యక్షులు తొలిచూరి శ్రీనివాసులు, యుటిఎఫ్ కోశాధికారి ఓగేటి శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు తిరుపతిరెడ్డి, బేతపూడి లింగారావు, శంకర్, ఈ టి యల్ శ్రీనివాస్, ఎస్ కే హజరత్ అలీ, రంకెల శ్రీనివాసరావు, మోడల్ స్కూల్ పీఈటి రాముడు, వెంకటేశ్వర్లు, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆటో స్పేర్ పార్ట్స్ దుకాణం దగ్ధం

విశాలాంధ్ర-బేస్తవారిపేట : విద్యుత్ షార్ట్ సూర్క్యూట్ తో ఆటో స్పేర్ పార్ట్స్ దుకాణం దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలోని ఆర్ కే నగర్ జంక్షన్ లోని ఒంగోలు నుండి గిద్దలూరు వెళ్లే రోడ్డులో పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని చెట్టిచెర్ల గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి గత 14 సంవత్సరాల క్రితం ఆటో స్పేర్ పార్ట్స్ షాప్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఆటోమొబైల్ షాప్ మొత్తం తగలబడిపోయింది. దీంతో షాపులోని మొత్తం వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమైపోయాయి. ఈ ప్రమాదంలో షాపు యజమానికి సుమారు రూ. 10 నుంచి 15 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు వస్తువులన్నీ మంటలలో పూర్తిగా దగ్ధం కావడంతో బాధితుడు శివ బోరున విలపించాడు. తీవ్రంగా నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరుతున్నాడు.

అంగన్వాడీలు సచివాలయాల ముట్టడి

విశాలాంధ్ర-వెలిగండ్ల : వెలిగండ్ల, సీఎస్‌పురం, హెచ్ఎం పాడు మండలాల పరిధిలోనీ మొగులూరు, వెలిగండ్ల వద్ద పిల్లల తల్లిదండ్రులతో కలిసి అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం సచివాలయ అధికారులకి అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, కార్యదర్శి ఎక్కంట రాధమ్మ, ముక్కు మహాలక్ష్మమ్మ సెక్టార్ నాయకులు గొర్రె ముచ్చు సలోమి, రెడ్డెం తిరుపతమ్మ, సిహెచ్ రఫీయా, అన్నెబోయిన పెద్దక్క ఆదిలక్షమ్మ, దమ్ము పద్మావతి, సోము వెంకట శ్రీలక్ష్మి, నాగేంద్రమ్మ, నారాయణమ్మ, బీజ్జం విజయలక్ష్మి, పాప బత్తిన ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి పవన్ కళ్యాణ్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర-ఒంగోలు : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో మరియు ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ సూచనల మేరకు అనిల్ కుమార్ కటకం శెట్టి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను తెలుసుకోవడంలో భాగంగా 75వ రోజు జనచైతన్య యాత్ర లో భాగంగా ఒంగోలులోని 12వ డివిజన్ లో మరాఠీ పాలెం లో పర్యటించి ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది,ఈ సందర్భంగా స్థానిక ప్రజానీకం జనసేన నాయకులతో మాట్లాడుతూ ఈ జగన్ రెడ్డి ప్రభుత్వంలో పెరిగిన ధరలతో మేము జీవనం సాగించడం చాలా కష్టంగా మారిందని,ప్రజల ఆదాయం పెరగలేదు కానీ కుటుంబ పోషణ ఖర్చు మాత్రం పెరిగిందని, ఇప్పటిదాకా అందరికీ ఒక అవకాశం ఇచ్చామని మాకు ఎవరూ చేసింది ఏమీ లేదని,జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారు తాను అధికారంలోకి వస్తే ఏమి చేస్తారో చెప్పిన విధానం మమ్మల్ని బాగా ఆలోచింప చేసిందని అలాంటి నాయకుడికి ఈసారి అండగా నిలుస్తామని అన్నారు,ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారి సారధ్యంలో ఏర్పాటు కాబోయే ప్రభుత్వంలో మన ప్రాంత అభివృద్ధికి కచ్చితంగా పాటుపడతామని,కీలకమైన సమస్యలను అధికారంలోకి వచ్చిన వెంటనే తీర్చేలా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు,అలానే 75 రోజులు సందర్భంగా స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చడం జరిగింది,ఈ కార్యక్రమం లో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు చనపతి రాంబాబు,కళ్యాణ్ ముత్యాల, ఒంగోలు నగర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పల్ల ప్రమీల,ఒంగోలు నగర జనసేన పార్టీ కార్యదర్శులు గోవింద్ కోమలి,సుధాకర్ చంగళశెట్టి,ఒంగోలు నగర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి ఆకుపాటి ఉష, వీర మహిళ మాదాసు సాయి నాయుడు,28వ డివిజన్ అధ్యక్షులు కోట సుధీర్,38వ డివిజన్ అధ్యక్షులు ఆలా నారాయణ,11వ డివిజన్ అధ్యక్షులు కోటు కిరణ్,మరియు జనసేన నాయకులు సుధాకర్ పసుపులేటి, మహేష్ జగితపి, గల గల పవన్,రాఘవ చంగళశెట్టి,చెన్ను నరేష్,నరసింహారావు,కొత్ర సాయి,రవీంద్ర, కోర శశి కుమార్,జనసేవ అవినాష్ పర్చూరి,పాండి,తదితరులు పాల్గొన్నారు.